## సీఎంను కలిసిన ప్రగతి ఫ్రూట్స్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రగతి ఫ్రూట్స్ కమీషన్ సభ్యులు

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడా మార్కెట్‌కు చెందిన ప్రగతి ఫ్రూట్స్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కొహెడాలో తొందరలోనే మార్కెట్ నిర్మాణం ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి తండు నర్సింహగౌడ్, సభ్యులు మహ్మద్ తాజ్‌బాయి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

**చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** చంపాపేట డివిజన్ యాదగిరినగర్ కాలనీలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి బుధవారం పర్యటించారు. కాలనీలో ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.30లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్ టూ వాల్‌గా సీసీ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని ఆయన జలమండలి అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ డీఈ రఫీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, కాలనీ ప్రతినిధులు కృష్ణారెడ్డి, కృష్ణ, రమేష్, కిషన్, నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

## మూసారాంబాగ్ డివిజన్‌లో పనులు ప్రారంభం

**చాదర్‌ఘాట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** మూసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్ కాలనీలో గల అజయ్ హట్స్, వాంబేకాలనీ మురికివాడల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. బుధవారం అజయ్ హట్స్ నుంచి వాంబే కాలనీ వరకు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. మురికివాడల్లోని ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ వివరించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సూపర్‌వైజర్ కుమార్, బస్తీవాసులు సరస్వతి, సందీప్‌యాదవ్, సబ్బి నవీన్, రాములు, నాగరాజు, ఉమేష్ పాల్గొన్నారు.


డీసీసీబీ చైర్మన్ సత్తయ్యను సన్మానిస్తున్న సంఘం చైర్మన్ భరత్‌కుమార్

## సహకార సంఘాన్ని సందర్శించిన డీసీసీబీ చైర్మన్


**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారంలోని రైతుసేవ సహకార సంఘాన్ని బుధవారం టీఎస్ క్యాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సందర్శించారు. ఈసందర్భంగా డీసీసీబీ చైర్మన్‌ను సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ రాకేష్, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**వనస్థలిపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** మన్సూరాబాద్ పెద్దచెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, పలు విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ నర్సింహారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిమజ్జనానికి వాహనాలు సాఫీగా వచ్చేందుకు పలు కనెక్టింగ్ రోడ్లను వెడల్పు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని, విద్యుత్ అధికారులు విద్యుత్‌వైర్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ దామోదర్, సీతరాం, మన్సూర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా అనిల్‌కుమార్



**చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేటకు చెందిన సిల్వేరు అనిల్‌కుమార్ నియమితులయ్యారు. సిల్వేరు అనిల్‌కుమర్‌ను బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా నియమిస్తూ బుధవారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తన ను బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా నియమించినందుకు గాను బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, పార్టీ జాతీయ నాయకుడు పేరాల శేఖర్‌జీ, కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

**వనస్థలిపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 23న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వనస్థలిపురం సబ్ డివిజన్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న వనస్థలిపురం విద్యుత్ ఏడీ రామచందర్ తెలిపారు. బుధవారం కార్యాలయంలో ఏడీ మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసే కార్యక్రమానికి సీ.జీ.ఆర్.ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్స్ ఫైనాన్స్ అధికారులు హాజరై విద్యుత్ సమస్యలపై సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలు, బిల్లులో హెచ్చుతగ్గులు విషయంపై ఫిర్యాదులు, సత్వర న్యాయం పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విద్యుత్ ఏడీ కోరారు.

# బడంగ్‌పేట్ అభివృద్ధికి రూ.51.43కోట్లు

- కౌన్సిల్ సమావేశంలో మేయర్ పారిజాతారెడ్డి వెల్లడి


మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మొత్తం 32 డివిజన్లలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ, సభ్యుల ప్రతిపాదనల మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్టు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. రూ.47.63కోట్లు మునిసిపల్ సాధారణ నిధులతో పాటు రూ.3.80కోట్లు పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు కలిపి మొత్తం రూ.51.43కోట్లతో ప్రాధాన్యతాక్రమంలో డివిజన్లలో అభివృద్ధి పనులు చేయాలని తీర్మానించినట్టు ఆమె వెల్లడించారు. బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం మేయర్ పారిజాతారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ఎజెండాను ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి సభలో ప్రవేశపెట్టగా.. సభ్యులు దానిలోని అంశాలపై చర్చించి తమ ఆమోదం తెలిపారు. పలువురు సభ్యులు తమ డివిజన్లలోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా మేయర్ సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టాల్సిన పనులపై సభలో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా పాలకవర్గం సభ్యులు, అధికారుల సహకారంతో కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుంటున్నామని, మిగిలిన ఆరు నెలల్లోనూ అందుబాటులో ఉన్న నిధులతో వీలైనన్ని ఎక్కువ పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందడానికి కృషి చేద్దామని పేర్కొన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ జీ.రఘు, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, గుర్రంగూడ, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, వెంకటాపూర్, మామిడిపల్లి, బాలాపూర్ గ్రామాల్లోని డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**సరూర్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని బాలాజీనగర్‌కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతాప్రమణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కూనాయక్, కాలనీ అధ్యక్షుడు కొండా శ్రావణ్‌కుమార్‌యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బంద్ ప్రశాంతం


కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల సంఘాల నేతలు

**చాదర్‌ఘాట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం భారత్‌బంద్ మలక్‌పేటలో ప్రశాంతంగా జరిగింది. మలక్‌పేట మాల సంఘం ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌లోని పలు చోట్ల దుకాణాలు మూయించారు. సంఘం అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్‌ను మలక్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు జరగకుండా మాలల ఐక్యతతో అడ్డుకుని తీరుతామని బల్వంత్ అన్నారు.

### పీఎం దిష్టిబొమ్మ దహనం

**చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మాల(దళిత)సామాజిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ బంద్ చంపాపేట డివిజన్‌లో ప్రశాంతంగా జరిగింది. వ్యాపార సంస్థలు, హోటళ్లను మూసి వేయించారు. కర్మన్‌ఘాట్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ సర్వయ్య, కో-కన్వీనర్లు ఎం.సత్యనారాయణ, బలవంతరావు, నాగభూషనం, గంగం శివశంకర్, చీపూరి రాజు, పెంటయ్య, శ్రీధర్, మద్దెల నరేష్, రాజు, జంగయ్య, పరమేష్, మహేందర్ పాల్గొన్నారు.



సామూహిక నిరాహారదీక్షలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

## మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయులు సామూహిక నిరాహారదీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 12 ఏళ్ల నుంచి ఎందుకు ప్రమోషన్ ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. టీజీటీలను జూనియర్ లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి. కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. మహేష్ మాట్లాడుతూ.. సర్వీసులో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకే నియామక పరీక్ష ద్వారా ఎంపికై ఆలస్యంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వేతన వ్యత్యాసాలు తొలగించేందుకు నోషనల్ సర్వీస్ కల్పించాలన్నారు. నిరాహార దీక్షలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కె. జంగయ్య, చావరవి, ఫెడరేషన్ కోశాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎస్, ఐపీఎస్ ప్రైవేటైజేషన్ దుర్మార్గం

- లేటరల్ ఎంట్రీ విధానాన్ని ఎత్తివేయాలి : ఆర్. కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

**బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడం దుర్మార్గమైన చర్య అని, ఈ విధానానికి మోదీ ప్రభుత్వం తక్షణమే స్వస్తి పలకాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులగణనపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర కేబినెట్ లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా 45మందిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో భర్తీ చేయాలని నిర్ణయించడం ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటైజేషన్ చేయడమేనని ధ్వజమెత్తారు. ఈ విధానం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులు దక్కకుండా మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికే కేంద్రంలో 1,670 ఐఏఎస్, 1,482 ఐపీఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయకుండా దొడ్డిదారిన రాజకీయ కార్యకర్తలను భర్తీ చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగమే లేటరల్ ఎంట్రీ విధానం అని, దీన్ని ఎత్తివేయకపోతే దేశాన్ని స్తంభింపజేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

## రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువు

- పోస్టర్ ఆవిష్కరించిన సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్

**చార్మినార్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని న్యాయవాదులకు రక్షణ కరువైందని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆగస్టు 24న సిటీ సివిల్ కోర్ట్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కోర్టు ప్రాంగణంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల బోరబండ, సిద్దిపేట, జనగామలో వరుసగా న్యాయవాదులపై పోలీసుల దాడులు జరిగాయని, ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జిల్లాలలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు, బర్కా రాజేష్ కుమార్, సుధాన్షు, విశాల్ సింగ్, ప్రవీణరెడ్డి, జశ్వంత్ కౌర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు,

## మలిదశ ఉద్యమకారుడు ధన్‌రాజ్ మృతి


కారుకొండ ధన్‌రాజ్(ఫైల్)

**చంపాపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :** చంపాపేట డివిజన్ మహంకాళమ్మతోటకు చెందిన మలిదశ ఉద్యమకారుడు కారుకొండ ధన్‌రాజ్(56) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. 2001లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో ధన్‌రాజ్ చురుకైన పాత్ర పోషించారు. బుధవారం ధన్‌రాజ్ అంత్యక్రియలను చంపాపేటలోని శ్మశానవాటికలో నిర్వహించారు. ధన్‌రాజ్ మృతి పట్ల ఆయా పార్టీల నాయకులు, మలిదశ ఉద్యమకారులు ఘనంగా నివాళులు అర్పించారు. మృతుడికి భార్య గున్నమ్మ, ముగ్గురు కూతుర్లు, ఇరువురు కుమారులు ఉన్నారు.

## విద్యార్థుల్లో వచ్చే మార్పులను గమనిస్తుండాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న లైన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కోటేశ్వర్‌రావు

**చంపాపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** తరగతి గదుల్లో విద్యార్థుల్లో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు గమనిస్తుండాలని లైన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ డీ.కోటేశ్వర్‌రావు అన్నారు. హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్‌లోని భవిష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో హైదరాబాద్ శాలివాహన లైన్స్‌క్లబ్ సౌజన్యంతో బుధవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎలా మెలగాలి అనే అంశంపై(లైన్స్ క్వెస్ట్) రెండు రోజుల పాటు నిర్వహించనున్న సెమినార్‌ను గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల రోజువారి దినచర్యలో జరిగే మార్పులు వారి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందన్నారు. దీన్ని అరికట్టడంలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర వహించాలని కోరారు. సుమారు 30పాఠశాలల ఉపాధ్యాయులు సెమినార్‌లో పాల్గొనగా, లైన్స్ క్వెస్ట్ ట్రైనర్ రేణుక కొండపల్లి చెప్పిన విషయాలను జాగ్రత్తగా విన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టీ.శ్రీనివాస్‌రెడ్డి, పాస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జీ.మహేంద్రకుమార్‌రెడ్డి, పీడీజీ గోవిందరాజు, జిల్లా లైన్స్ క్వెస్ట్ చైర్మన్ వీ.మాధవరావు పాల్గొన్నారు.

## ఇంటి ముందు కారు పార్కింగ్‌పై గొడవ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరు వర్గాలు.. కేసు నమోదు

**అబ్దుల్లాపూర్‌మెట్:** ఇంటి ముందు కారు పార్కింగ్ వ్యవహారం గొడవగా మారి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కేలా చేసిం ది. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో హయత్‌నగర్ పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. వివరాల ఇలా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట్ సాయికాలనీలో నివాసం ఉండే పడమటి సీతారెడ్డి చిన్న కుమారుడి వివాహం సోమవారం జరిగింది. మంగళవారం రిసెప్షన్ ఉన్నది. ఇదిలా ఉండగా మణికొండకు చెందిన పున్న నవీన్ భార్య అక్షరతో కలిసి కారులో పెద్దఅంబర్‌పేట్ సాయినగర్‌కాలనీలో సీతారెడ్డి ఇంటి పక్కనే ఉంటున్న అమ్మమ్మ ఇంటికి మంగళవారం ఉదయం వచ్చారు. అయితే సీతారెడ్డి ఇంటి ముందు పెళ్లి పందిరిలో కారు పార్కు చేశాడు. దీంతో సీతారెడ్డి కల్పించుకుని పిల్లలు ఉన్నారు.. ఇంత వేగంగా వస్తే ఎలా అని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన నవీన్ సీతారెడ్డి మెడను పట్టి కారుతో కొద్ది దూరం వరకు లాక్కెళ్లి తోసేశాడు. దీంతో సీతారెడ్డి కింద పడ్డాడు. కారును మూడు సార్లు వెనక్కు.. ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో సీతారెడ్డి బంధువు యంజాల ఉమా, జగన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, పెంటారెడ్డికి గాయాలయ్యాయి. ఇది చూసిన బంధువులు, కాలనీవాసులు అతడిని పట్టుకుని చితకబాదారు. వెంటనే నవీన్ తన భార్యను తన అమ్మమ్మ ఇంట్లో వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం 100కు ఫోన్‌చేసి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. సీతారెడ్డి కుటుంబ సభ్యులు నవీన్‌కు భార్య అక్షరతో ఫోన్ చేయించారు. వెంటనే అక్కడికి వచ్చిన నవీన్, సీతారెడ్డి కుటుంబ సభ్యులు మరో సారి గొడవపడ్డారు. నా గొంతు పట్టుకుని కింద పడేసి భయభ్రాంతులకు గురిచేశాడని, తనకు చెందిన 5 తులాల బంగారం పోయిందని హయత్‌నగర్ పోలీసులకు సీతారెడ్డి ఫిర్యాదు చేశాడు. లక్ష ముప్పై వేల నగదు, 8 తులాల బంగారు గొలుసును లాక్కున్నారని నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కదం తొక్కిన కార్మికులు

- మధ్యాహ్న భోజన పథకాన్ని హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించవద్దని
- చలో హైదరాబాద్‌కు పిలుపు
- 400 మందికి పైగా కార్మికుల అరెస్టు

**ఖైరతాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఆ పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్టే అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దాదాపు 430 మంది కార్మికులను ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి, బోయిన్‌పల్లి, షాయ్‌నాత్‌గంజ్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లతో పాటు హెడ్ క్వార్టర్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) అధ్యక్షురాలు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కార్మికులు 24 సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాలకోర్చి పని చేస్తుండగా ప్రస్తుతం వారందరి బతుకులు బజారున పడేలా ముఖ్యమంత్రి హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్‌కు మధ్యాహ్న భోజన పథకం మొత్తాన్ని అప్పగించేందుకు వారితో ఒప్పందం జరుపుకొనేందుకు సమాయత్తమయ్యారని ఆరోపించారు. గత ఎన్నికల వాగ్దానాల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెలా రూ.10 వేల వేతనం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


చిన్నారి అదిర

**ఎల్బీనగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** వైద్యుల నిర్లక్ష్యంతో తమ పాప మృతి చెందిందని పాప బంధువులు కొత్తపేటలోని పారమిత ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. నల్గొండ పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు తన కూతురు అదిర(5)కు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగడంతో నల్గొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి పాప పరిస్థితి సరిగా లేదని వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లమని సూచించారు. దీంతో వారు తమ పాపను మంగళవారం రాత్రి 12గంటలకు కొత్తపేటలోని పారమిత ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో పాపకు వెంటనే వైద్యం ప్రారంభించకుండా అడ్మిషన్ పేరుతో 45 నిమిషాల సేపు కాలయాపన చేస్తూ ఆస్పత్రిలో పై అంతస్తుకు కిందికి తిప్పారని పాప తండ్రి అజయ్‌బాబు చెప్పారు. చివరకు రూ. 35వేలు కట్టించుకుని వైద్యం ప్రారంభించిన వైద్యులు పాప చనిపోయిందని చెప్పారని ఆయన తెలిపారు. మీరు అడ్మిషన్ తీసుకోవడం ఆలస్యం కావడంతోనే ఇలా జరిగిందని వైద్యులు అన్నారని మృతురాలి కుటుంబీకులు తెలిపారు. దీంతో ఆస్పత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ పాప మృతిచెందిందని మృతురాలి బంధువులు కొత్తపేటలోని పారమిత ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమ పాప మృతికి కారణమైన ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, వైద్యాధికారులు వెంకటరమణ, అర్చనలు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెప్పారు.


డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న పాప కుటుంబీకులు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన యాతం కృష్ణమ్మ

**చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):** నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె మృతిచెందిన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. చంపాపేట డివిజన్ భైరామల్‌గూడకు చెందిన యాతం కృష్ణమ్మ(55) కుమారుని వద్ద ఉంటూ ఇళ్లలో పాచి పని చేస్తుంది. రోజు మాదిరిగా బుధవారం ఉదయం 5గంటల ప్రాంతంలో భైరామల్‌గూడ నుంచి ఫిసల్ బండ మీదుగా నడుచుకుంటూ చంద్రాయణగుట్ట సమీపంలోని ఫరివార్ టౌన్‌షిప్‌లోకి బయలుదేరింది. మిధానీ బస్ డిపో వద్ద ప్రధాన రహదారిపై కృష్ణమ్మను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. పోలీసులు వెంటనే ఆమెను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బొల్లపల్లి గ్రామం. మృతురాలి కుమారుడు యాతం జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.